# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 4.10.2025 | 24 క్యారెట్లు 11,85,300 | కిలో వెండి 1,62,000 | 24 °C | సంపుటి:3 | సంచిక:276

www.vishalabharati.com


## పోలీసులకు 'ఐబొమ్మ' వార్నింగ్..

### స్పందించిన తెలంగాణ ప్రభుత్వం




సినిమా పైరసీ రాకెట్‌ను ఛేదించిన హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులపై చాలామంది ప్రశంసలు కురిపించారు. ఈ మూఠాకు చెందిన ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద డెబిట్‌కార్డులు, హార్డ్‌డిస్క్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వార్తలు వచ్చిన కొన్ని గంటల్లోనే సినిమా పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ పేరుతో తెలంగాణ పోలీసులకు హెచ్చరికలు అంటూ

మిగతా 2లో



## సందడిగా అలయ్ బలయ్

- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్
- అలయ్ బలయ్ కార్యక్రమం
- మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ
- కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో
- రాజకీయ, సినీ ప్రముఖులు హాజరు
- అలయ్ బలయ్ తెలంగాణ ఆత్మ

"నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అలయ్ బలయ్ కార్యక్రమం శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, కిషన్ రెడ్డి, అర్జున్ రామ్ మేఘ్వాల్, జయంతి చౌదరి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ, బీజేపీ ఎంపీ లక్ష్మణ్, బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, సీపీఐ నేత నారాయణ, ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎంపీ వి.హనుమంతావు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ


మిగతా 2లో

## బీసీ వ్యూహం..




## ఏ పార్టీకి మేలు?

- స్థానిక ఎన్నికల సమరం
- తెరవెనుక కసరత్తులు
- బరిలో దిగిన ప్రధాన పార్టీలు
- బీసీలను ఐక్యం చేసే వ్యూహం
- రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం
- రాష్ట్రపతి వద్ద వెయిటింగ్




"తెలంగాణలో స్థానిక ఎన్నికల సమరానికి ప్రధాన పార్టీలు తెరవెనుక కసరత్తులు వేగవంతం చేశాయి. పదునైన వ్యూహాలతో స్థానిక ఎన్నికల బరిలో సత్తా చాటేందుకు సిద్ధమయ్యాయి. అయితే ఈసారి ఎన్నికలు కాస్త వైవిధ్యంగా కనిపిస్తున్నాయి. బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో ప్రజాక్షేత్రంలోకి అధికార కాంగ్రెస్ అడుగుపెడుతోంది. మీరేంతో.. మీకంత.. అంటూ బీసీలను ఐక్యం చేసి, గంపగుత్తగా ఓట్లు సాధించే ప్రయత్నాలు గట్టిగానే చేస్తోంది.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఇందులో భాగంగా ఇప్పటికే అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం, తరువాత గవర్నర్ గ్రీన్ సిగ్నల్, అక్కడి నుండి రాష్ట్రపతి వద్ద వెయిటింగ్ వరకూ కాంగ్రెస్ పాచిక చేరింది. ఇప్పుడు బంతి రాష్ట్రపతి కోర్టులో ఉంది. ఇలా మ్మాదేం తప్పులేదు, మేము బిసిలకు చేయాల్సిందంతా చేస్తున్నాం, అడ్డుపడుతున్నది బిజేపినే అంటూ బిసిలకు బిజేపిని దూరం చేసే ప్రయత్నం చేస్తోందనేది పొలిటికల్ టాక్. అంతేకాదు బిసిలకు 42శాతం రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికల్లో సీట్లు కేటాయిస్తూ గెజిట్ కూడా విడుదల చేసింది. తెలంగాణ వ్యాప్తంగా 31 జిల్లాల్లో, 565 మండలాల్లో స్థానిక ఎన్నికలు జరగబోతున్నాయి. కొత్త రిజర్వేషన్ల కేటాయింపు తరువాత ఏ కులాలకు తాజాగా

మిగతా 2లో



## పాక్‌ను మ్యాప్‌లో లేకుండా చేస్తాం

- భారత ఆర్మీ చీఫ్
- జనరల్ ఉపేంద్ర ద్వివేది
- ఘడ్సానా గ్రామంలో పర్యటన
- బిఎస్ఎఫ్ అధికారులతో సమావేశం
- సైన్యం గతంలోలా ఓపిక పట్టదు
- త్వరలో ఆపరేషన్ 2.0

2

"భారత ఆర్మీ చీఫ్, జనరల్ ఉపేంద్ర ద్వివేది పాకిస్తాన్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. రాజస్థాన్ లోని అనూప్‌గఢ్ లోని ఆర్మీ పోస్ట్‌ను, శ్రీ గంగానగర్ లోని ఘడ్సానా గ్రామంలోని 22 ఎండిలో సరిహద్దు ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్మీ, బిఎస్ఎఫ్ అధికారులతో సమావేశమై ఉగ్రవాదంపై భారతదేశం చేస్తున్న సన్నద్ధతను సమీక్షించారు.



## వచ్చే మూడేళ్లు కీలకం

- హైదరాబాద్ బీజేపీ స్టేట్ ఆఫీస్
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- స్టేట్ లీగల్ సెల్ సమావేశం
- కొత్త సమస్యలు వచ్చే అవకాశం
- సమర్థవంతంగా ఎదుర్కోవాలి
- తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు

"కేంద్ర ప్రభుత్వానికి వచ్చే మూడేళ్లు చాలా కీలకమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతి శాఖ అనేక రిఫార్మ్స్ తీసుకువస్తోందని చెప్పుకొచ్చారు. కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉందని... వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బ్రిటిష్ చట్టాలు ఇప్పటికీ అమలు అవుతున్నాయని తెలిపారు. వర్తమాన ప్రజల ఆలోచనలకు అనుగుణంగా చట్టాలు తేవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆలోచిస్తున్నారని చెప్పుకొచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో ఆ పార్టీ స్టేట్ లీగల్ సెల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు, ఎంపీలు కే.లక్ష్మణ్, రఘునందన్ రావు

మిగతా 2లో

## రేవంత్ రెడ్డిని వదిలి పెట్టను

- జన్ సురాజ్ పార్టీ అధినేత
- ప్రశాంత్ కిషోర్
- సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం
- వచ్చే ఎన్నికల్లో తెలంగాణకు
- రేవంత్‌ను ఓడించి తీరుతాను
- బిహార్ ప్రజలకు అవమానం



"జన్ సురాజ్ పార్టీ అధినేత, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిపై మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "వచ్చే ఎన్నికల్లో తెలంగాణకు వెళ్లి రేవంత్‌ను ఓడించి తీరుతాను.. రాహుల్ గాంధీ, మోడీ ఎవరూ కాపాడలేరు" అని తాజాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బిహార్ ఎన్నికలు జరుగుతున్న సమయంలో తన జన్ సురాజ్ పార్టీని బలోపేతం చేసుకోవడానికి రేవంత్ రెడ్డిని ప్రశాంత్ కిషోర్ ఉపయోగించుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2023 డిసెంబర్‌లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు పై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ తన కేబినెట్‌లో

మిగతా 2లో



## వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

"దసరా పండుగ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి సంచలన నిర్ణయం ప్రకటించడం అందరికీ షాక్ ఇచ్చింది. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని స్పష్టం చేయడంతో ఆయన అభిమానులతో పాటు, కాంగ్రెస్ నేతలు సైతం ఆశ్చర్యానికి గురయ్యారు.

- వైభవంగా దసరా ఉత్సవాలు
- జగ్గారెడ్డి సంచలన నిర్ణయం
- తెలంగాణ కాంగ్రెస్ సీనియర్
- వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను
- నా భార్య నిర్మల పోటీ చేస్తారు
- సీఎం దృష్టికి కూడా తీసుకెళ్తా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తన భార్య నిర్మల బరిలోకి దిగుతారని తెలిపారు. దాంతో ఈ అనూహ్య నిర్ణయం వెనుక ఆంతర్యం ఏంటని రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతోంది.


**జగ్గారెడ్డి ఏమన్నారంటే..**

ఓ కార్యక్రమంలో పాల్గొన్న జగ్గారెడ్డి మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయను. సంగారెడ్డి నియోజకవర్గం నుండి నా భార్య నిర్మల పోటీ చేస్తారని ఆయన స్పష్టం చేశారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపించినందుకు నియోజకవర్గ అభివృద్ధికి తాను చేయగలిగినదంతా చేశానని ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. అయితే శాశ్వతంగా రాజకీయాలకు దూరమవడం లేదని తేల్చి చెప్పారు. కేవలం పదేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయనని తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్తానని అన్నారు. ప్రస్తుతం తన వయస్సు 59 ఏళ్లని.. మరో పదేళ్ల తర్వాత మళ్లీ

మిగతా 2లో

## ఫుల్ కిక్కే కిక్కు

- రాష్ట్రంలో ఘనంగా దసరా
- మందు బాబులకు ఫుల్లు కిక్కు
- రికార్డు స్థాయిలో అమ్మకాలు
- రూ. 419 కోట్ల అమ్మకాలు
- సెప్టెంబర్ 26 నుంచి డబుల్
- వైన్ షాపుల వద్ద రద్దీ



"దసరా మందు బాబులకు ఫుల్లు కిక్కు అందించింది. రాష్ట్ర ఖజానాకు పండుగ తెచ్చింది. రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. రెండు రోజుల్లోనే దాదాపు రూ 420 కోట్ల మేర మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణ రోజుల అమ్మకాలతో పోల్చితే ఇవి చాలా రెట్లు అధికంగా ఉన్నాయి.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఈ సారి దసరా అక్టోబర్ 2న రావటంతో మద్యం అమ్మకాలు ఆ రోజున లేకపోవటంతో ఎక్సైజ్ అధికారులు ఆలోచనలో పడ్డారు. మందుబాబులు మాత్రం ఖజానా కు పండుగ ఆదాయం భారీగా తెచ్చారు. దసరా పండుగ వేళ రాష్ట్రంలో రికార్డ్ స్థాయిలో మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ ఒకటో తేదీల్లో మందుబాబులు భారీగా మద్యం కొనుగోలు చేశారు. రెండు రోజుల్లో

మిగతా 2లో

## రక్షణ భూములు ఇవ్వండి

- రాజ్‌నాథ్ సింగ్ పర్యటన
- మంత్రి పొన్నం ప్రభాకర్
- రక్షణ భూములు ఇవ్వండి
- కీలకమైన ప్రజా ప్రయోజనాలు
- వినతిపత్రం అందజేశారు
- రూ.1,000 కోట్లు పెండింగ్‌లో

2



"హైదరాబాద్‌లోని కొన్ని రక్షణ భూములను కీలకమైన ప్రజా ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి విడిచిపెట్టడానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. రాజ్‌నాథ్ సింగ్ హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఆయనకు మంత్రి పొన్నం ప్రభాకర్ బేగంపేట విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం
4.10.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily
GENERAL NEWS



## పోలీసులకు ‘ఐబొమ్మ’ వార్నింగ్..

మొదటి పేజీ తరువాయి

ఒక పోస్ట్ వైరల్ అయింది. తాజాగా వాటిని తెలంగాణ ప్రభుత్వం ఖండించింది. ఈ అంశంపై వచ్చిన బెదిరింపుల వార్తలు అవాస్తం అంటూ తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ టీమ్ చెప్పింది. ఐ బొమ్మ గురించి తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ పేజీ తమ ‘ఎక్స్’లో ఓ పోస్టు పెట్టింది. ‘కొన్ని మీడియా కథనాలు, సోషల్ మీడియా పోస్టుల ప్రకారం, సినిమా పైరసీ సైట్ ఐబొమ్మ తెలంగాణ పోలీసులకు హెచ్చరిక జారీ చేసి, గోప్యమైన ఫోన్ నంబర్లను లీక్ చేస్తామని బెదిరించిందని చెబుతున్నారు. అయితే, ప్రసారం అవుతున్న స్క్రీన్‌షాట్‌లు 2023 నాటివి. అవి కూడా పోలీసులకు కాకుండా తెలుగు సినిమా పరిశ్రమకు సంబంధించినవే. దీనిని స్పష్టం చేస్తూ, తెలంగాణ పోలీసులకు ఇలాంటి ఎటువంటి బెదిరింపు రాలేదని తెలియజేస్తున్నాం.



# సందడిగా అలయ్ బలయ్

మొదటి పేజీ తరువాయి

మాదిగ, టాలీవుడు ప్రముఖ నటులు నాగార్జున, బ్రహ్మానందం తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయ నాయకుల మధ్య ఐక్యత కోసం బండారు దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రతి ఏటా దసరా మరునాడు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. తెలంగాణ సంస్కృతి, ఆహారపు అలవాట్లను చాటిచెప్పేలా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. అయితే ఈసారి మాత్రం ఆపరేషన్ సిందూర్ థీమ్‌తో ఈ కార్యక్రమం జరుగుతోంది. అలయ్ బలయ్ ఒక సంప్రదాయం మాత్రమే కాదని.. తెలంగాణ ఆత్మని ఈ కార్యక్రమం నిర్వాహకులు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అభివర్ణించారు. స్వదేశీ భావనతో ముందుకు వెళ్లాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. సేంద్రీయ వ్యవసాయం వైపు అడుగులు వేయాలంటూ రైతులకు ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ చరిత్రలో ప్రతీ మార్పులో యువత కీలకపాత్ర పోషించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు బండారు దత్తాత్రేయ సూచించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యం కోసమే రాష్ట్రాల విభజన జరిగినట్లు పేర్కొన్నారు. ప్రాంతాలకు అతీతంగా కలిసికట్టుగా ఉండాలంటూ తెలుగు రాష్ట్రాల ప్రజలకు పిలుపు నిచ్చారు. యువత సనాతన ధర్మం వైపు చూస్తుందన్నారు. మనకు దసరాతోపాటు జీఎస్టీ పండగ వచ్చిందని తెలిపారు. పెరిగిన ధరలు తగ్గించి ప్రధాని మోదీ రికార్డు సృష్టించారని చెప్పారు. దసరా రోజు అందరి నుంచి ఆశీర్వాదం తీసుకోవడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. అయితే బయట రాజకీయ నేతలు చాలెంజ్‌లు విసురుకుంటారు.. కానీ పండగ పూట ఒకే వేదికపైకి తీసుకు వచ్చి కలుసుకునే విధంగా ఏర్పాటు చేసిన కార్యక్రమమే అలయ్ బలయ్ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వివరించారు.

# వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

మొదటి పేజీ తరువాయి



రాజకీయాల్లోకి వస్తానని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఈ పదేళ్ల వ్యవధిలో ఎవరు వస్తారో తెలియదని.. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన వారికి అవకాశం ఇవ్వాలని ఆయన అన్నారు. ఇక జగ్గారెడ్డి భార్య నిర్మల ప్రస్తుతం టీజీఐఐసీ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో జగ్గారెడ్డి తరపున నియోజకవర్గ వ్యవహారాలను వారి కుమార్తె జయారెడ్డి చూసుకునేవారు. ఆమెకు గత ఆగస్టులో వివాహం కావడంతో, అప్పటి నుంచి నిర్మల నియోజకవర్గ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. అయితే ఆయన నిర్ణయంపై కాంగ్రెస్ హైకమాండ్ ఎలా స్పందిస్తుందో చూడాలి. ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉండగా ఇప్పుడు ఈ ప్రకటన చేయడం ఏంటని పొలిటికల్ వర్గాల్లో డిస్కషన్ నడుస్తోంది. మరోవైపు దేశవ్యాప్తంగా రాజకీయాల్లో కొత్త పోకడలు చోటు చేసుకుంటున్నాయి. పలు పార్టీలు పాతతరం నాయకులను పక్కనపెట్టి కొత్తవారికి.. ముఖ్యంగా మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నా యి. ఈ పరిణామాలను ముందే గ్రహించిన జగ్గారెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఆయన మనసులోని మాట జగ్గా రెడ్డి బయటపెట్టారని అంటున్నారు. మరి ఆయన నిర్ణయంపై కాంగ్రెస్ హైకమాండ్ ఎలా రియాక్ట్ అవుతుందో చూడాలి? వచ్చే ఎన్నికలకు ఇంకా సమయం ఉందని టాపిక్‌ని డైవర్ట్ చేస్తారేమో చూడాలి. మొత్తానికి తెలంగాణ రాజకీయాల్లో జగ్గారెడ్డి శకం ముగిసిందని చెప్పవచ్చు.

# రేవంత్ రెడ్డిని వదిలి పెట్టను

మొదటి పేజీ తరువాయి

బిహార్‌కు చెందిన అధికారులను ఎక్కువగా నియమించారని, వారిని అడ్డం పెట్టుకుని కుట్రలు చేస్తున్నారని..దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఆ సమయంలో ఓ టీవీ చానల్ తో మాట్లాడుతున్న సమయంలో “తెలంగాణ డీఎన్ఏ బిహార్ డీఎన్ఏ కంటే బెటర్.. బిహార్ వాళ్ల డీఎన్ఏలోనే కూలీ పని ఉంది” అని రేవంత్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు బిహార్ ప్రజలను అవమానించినట్లుగా ఉన్నాయని బీజేపీ, ఆర్జేడీ, జేడీయూ వంటి పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ప్రశాంత్ కిషోర్ సీరియస్ గా తీసుకున్నారు. “రేవంత్ బిహార్ ప్రజలను అవమానిస్తున్నాడు. బిహార్ వాళ్ల డీఎన్ఏ తక్కువ అంటే, మీరు మా సహాయం ఎందుకు అడిగారు?” అని ప్రశాంత్ కిషోర్ ప్రశ్నించారు. రేవంత్ తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఢిల్లీలో తనను మూడుసార్లు సంప్రదించి, ఎన్నికల వ్యూహాలకు సహాయం అడిగారని కూడా పీకే తెలిపారు. 2025 ఆగస్టులో బిహార్‌లో కాంగ్రెస్–ఆర్జేడీ కలిసి నిర్వహించిన ‘వోటర్ అధికార్ యాత్ర’లో రేవంత్ రెడ్డి పాల్గొనడం ప్రశాంత్ కిషోర్‌కు ఆగ్రహం తెప్పించింది. రాహుల్ గాంధీ, తేజస్వి యాదవ్ నేతృత్వంలో జరిగిన ఈ 16 రోజుల యాత్రలో రేవంత్ ప్రచారం చేయడం బిహార్ ప్రజల అవమానమని ప్రశాంత్ కిషోర్ అప్పుడే ఖండించారు. “రేవంత్ బిహార్ వాళ్లపై దుర్మార్గ వ్యాఖ్యలు చేస్తాడు. బిహార్ గ్రామాలకు వస్తే, ప్రజలు అతన్ని తరిమికొడతారు” అని హెచ్చరించారు. రాహుల్ గాంధీ రేవంత్‌ను ఆహ్వానించడం “బిహార్ గౌరవానికి అవమానం” అని కూడా విమర్శించారు. ప్రశాంత్ కిషోర్ 2025లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జన్ సురాజ్ పార్టీతో పోటీ పడుతున్నారు. ఆత్మగౌరవ నినాదం ద్వారా బిహార్ ప్రజల్లో తమ పార్టీకి మద్దతు పెంచుకోవాలని, కాంగ్రెస్‌పై రేవంత్‌తో లింక్ చేసి విమర్శలు రేకెత్తించాలని వ్యూహమని భావిస్తున్నారు. ప్రశాంత్ కిషోర్ తనను టార్గెట్ చేస్తూ చేస్తున్న విమర్శలు, ఆరోపణలపై ఇప్పటి వరకూ రేవంత్ రెడ్డి స్పందించలేదు.

# వచ్చే మూడేళ్లు కీలకం

మొదటి పేజీ తరువాయి

పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అర్జున్ రామ్ మేఘవాల్ ఐఏఎస్‌గా ఉన్నప్పటికీ రాజీనామా చేసి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారని ప్రశంసించారు. బీజేపీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం పాలసీలకు అనుగుణంగా కోర్టుల్లో మనం వాదిస్తామనేది చాలా కీలకమని తెలిపారు. రానున్న మూడేళ్లు మోదీ ప్రభుత్వానికి చాలా కీలకమని ఉద్ఘాటించారు. అందుకు ప్రత్యేకమైన శిక్షణ తరగతులు నిర్వహించాలని మార్గనిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వ స్టాండ్ బలంగా వినిపించేందుకు ఎఫర్ట్ పెట్టాలని సూచించారు. తెలంగాణలో అధికారంలోకి బీజేపీ రావాలి అంటే అందరం కలసి కట్టుగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు కిషన్‌రెడ్డి. కాలం చెల్లిన చట్టాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ రద్దు చేశారని బీజేపీ ఎంపీ కే.లక్ష్మణ్ తెలిపారు. దేశాన్ని ఆర్థికంగా విచ్చిన్నం చేసేందుకు ఇతర దేశాలు కుట్రలు పన్నుతున్నాయని విమర్శించారు. ప్రధాని మోదీ విజనరీ లీడర్ కాబట్టి వేగంగా స్పందిస్తున్నారని చెప్పుకొచ్చారు. జీఎస్టీ తగ్గింపుతో మోదీ దీపావళి వెలుగులను పేదల ఇళ్లల్లో నిప్పుతున్నారని వివరించారు. అగ్రదేశాలు అడ్డగోలు టారిఫ్‌లతో భారతదేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. ఇండియా ఎదుగుదలను చాలా దేశాలు జీర్ణించుకోలేక పోతున్నాయని ఫైర్ అయ్యారు. స్వదేశీ వస్తువుల వినియోగించడం ద్వారా.. భారతదేశ ఆదాయం ఇతర దేశాలకు వెళ్లకుండా ఉంటుందని వెల్లడించారు. దీని ద్వారా పెట్టుబడులు పెరుగుతాయని... ఇతరులకు ఉపాధి కలుగుతోందని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం దక్కాలని గత చట్టాలను రద్దు చేసి.. భారత న్యాయ సంహిత చట్టాలను మోదీ సర్కార్ తెచ్చిందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. హైదరాబాద్ నడి రోడ్డుపై గతంలో ఓ న్యాయవాది దంపతులను నరికి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు వేసిన వాళ్లను వెనక్కి తీసుకోకపోతే హత్య చేశారని చెప్పుకొచ్చారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు ప్రస్తుతం జరుగుతోందని వివరించారు. న్యాయవాదులకు భద్రత కల్పించే చట్టాలు దేశంలో రావాలని రాంచందర్ రావు ఆకాంక్షించారు.

# బీసీ వ్యూహం.. ఏ పార్టీకి మేలు?

మొదటి పేజీ తరువాయి

సీటు కేటాయింపులు ఎలా ఉన్నాయంటే..

**ఏ సామాజిక వర్గాలకు ఎంత శాతం..**

ప్రధానంగా జెడ్పీ చైర్ పర్సన్ త్జాజా లెక్కలు పరిశీలిస్తే బీసీలకు 41.93శాతం, ఎస్సీలకు 19.35, ఎస్టీలకు 12.90, ఓసీలకు 25.80 శాతం సీట్లు కాటాయించింది. జిల్లాల వారీగా రిజర్వేషన్లు చూస్తే ఖమ్మ జిల్లా జడ్పీ చైర్మెన్ ఎస్టీ అభ్యర్ధికి, ములుగు జడ్జీ చైర్మెన్ ఎస్టీ మహిళకు కేటాయించారు. నల్గొండ జడ్పీ చైర్ పర్సన్ ఎస్టీ మహిళకు, వరంగల్ ఎస్టీ, హన్మకొండ, జనగామ జడ్పీలు ఎస్సీ మహిళకు కేటాయించారు. జోగులాంబ గద్వాల్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి జిల్లాల జెడ్పీ చైర్ పర్సన్ పదవులు ఎస్సీ మహిళ, సంగారెడ్డి ఎస్సీ కోటా, జయశకంకర్ భూపాలపల్లి, కరీంనగర్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలు బిసి అభ్యర్దులకు కేటాయించారు. నిర్మల్, నిజామాబాద్, సిద్ధిపేట, సూర్యాపేట, వికారాబాద్ జడ్జీలు బీసిలకు కేటాయించారు.మహబూబ్ నగర్, మంచిర్యాల, నాగర్ కర్నూల్, వనపర్తి, యాదాద్రి భువనగిరి జడ్పీలు బీసీ మహిళ ఇచ్చారు. ఆదిలాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, నారాయణపేట జడ్పీలు ఓసీ మహిళ కేటాయించారు. భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, మహబూబాబాద్, మెదక్ జడ్పీలు ఓసీ జనరల్ కు ఇచ్చారు. ఇలా స్దానిక ఎన్నికల్లో కీలకంగా మారిన జెడ్పీ చైర్ పర్సన్ స్దానాలో మీరెంతో, మీకంత అనే రూల్ ఫాలో అయ్యింది అధికార కాంగ్రెస్ ప్రభుత్వం.

**ఓటు బ్యాంకును తేల్చనున్న స్థానిక ఎన్నికలు..**

రాబోతున్న స్దానిక సంస్దల ఎన్నికలే తెలంగాణలో అన్ని పార్టీలకు ఆయువుపట్టులాంటివి. స్దానికంగా బలమైన క్యేడర్ ను ఏర్పాటు చేసుకోవడంతోపాటు, సర్పంచ్ లు, ఎంపీటీసిలు, జెడ్ పీటీసీలలో ఎక్కువ సీట్లు దక్కించుకోవడం ద్వారా ఓటు బ్యాంక్ ను మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ ఎన్నికలే సరైన అవకాశం. ఈ ఎన్నికల్లో గెలుపు లెక్కల ఆధారంగానే మరో మూడేళ్ల తరువాత అసెంబ్లీ, పార్లమెంట్ ఫలితాలు ఆధారపడి ఉంటాయి. స్దానిక ఎన్నికల్లో గెలిచిన అభ్యర్దులే ఆయా పార్టీలు అధికారం చేపట్టడంలో క్షేత్ర స్దాయిలో కీలకంగా వ్యవహరిస్తారు. స్దానిక సంస్దల ఎన్నికలే తెలంగాణలో రెండేళ్ల కాంగ్రెస్ పాలకు కొలమానంగా ఆ పార్టీ భావిస్తోంది. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తుందనే నమ్మకం కల్పించామనే ధీమాతో ఉంది. గత పదేళ్లు అధికారంలో లేకపోవడంతో కాంగ్రెస్ కు క్యాడర్ దూరమైయయింది. కేవలం కాంగ్రెస్ విధేయులు మాత్రమే పార్టీలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో సాధ్యమైనంత ఎక్కువ మంది ప్రజాప్రనిధులు కాంగ్రెస్ నుండి గెలిస్తే వారితో వచ్చే క్యాడర్ పార్టీకి బలంగా మారుతుందని అంచానా వేస్తోంది.అందులోనూ 42శాతం బిసి రిజర్వేషన్ సానుకూలంగా ప్రభావం చూపుతుందని భావిస్తోంది రేవంత్ సర్కార్. ఎన్ని అడ్డంకులు వచ్చినా కాంగ్రెస్ చిత్తశుద్ధి చూపించిందనే నమ్మకం జనాల్లోకి వెల్లిందని, బీసీలంతా తమకే ఓటేస్తారనే బిసి మంత్రులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పించడం కూడా అనుకూల ఫలితాలు వస్తాయని భావిస్తోంది. రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నాలకు బోనస్ వంటి అంశాలపై కూడా చాలా ఆశలు పెట్టుకుంది. ఇవన్నీ స్దానిక ఓటర్లపై ప్రభావం చూపే అంశాలు. ఈ ఎన్నికల్లో సత్తా చాటి ప్రతిపక్షాలకు గట్టి బదులివ్వాలని భావిస్తోంది కాంగ్రెస్ పార్టీ.

**బలాన్ని నిరూపించుకోవాలనుకుంటున్న బీఆర్ఎస్, బీజేపీ..**

బీఆర్ఎస్ కూడా తామేం తక్కువ తినలేదంటూ స్దానిక పోరుకు సిద్దంగా ఉంది. ఈ ఎన్నికల్లో మంచి ఫలితాల సాధిస్తే క్యాడర్ లో కొత్త జోష్ వస్తుందని నమ్ముతోంది. కాంగ్రెస్ సర్కార్ పై వ్యతిరేకత వచ్చిందనేది నిరూపించే ఎన్నికలు ఇవేనని గులాబీ నేతలు భావిస్తున్నారు. గల్లీ ఎన్నికలైనా.. ఢిల్లీ ఎన్నికలైనా కేసీఆర్ మళ్లీ రావాలని కోరుకుంటున్నారనేది ఈ ఎన్నికల ఫలితాల ద్వారా నిరూపించాలని ఉవ్విళ్లూరుతున్నారు. బిజెపి కూడా క్షేత్రస్దాయిలో తమ బలాన్ని పరిక్షించుకోవడానికి, లోకల్ గా పార్టీకి చికిత్స చేయడానికి స్దానిక ఎన్నికలే సరైన వేదికగా భావిస్తోంది. పార్టీలో సమన్వయ లోపంతో మంచిఫలితాలు రావడంలేదని భావనలో ఉంది. ఆ లోపాలను స్దానికంగా సరిచేసుకోవాలని, ప్రత్యర్దులకు గట్టి సమాధానం ఇవ్వాలని భావిస్తోంది. 8 ఎంపీలు గెలిచిన మాకు 35శాతం ఓటు బ్యాక్ ఉంది. రూరల్ సైడ్ మా బలం పెరిగింది. స్దానిక పోరులో బిజెపి నంబర్ వన్ లో ఉంటుందని కమలం నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే తాజ్జాగా మారిన బీసీ లెక్కల ప్రకారం బీసీలు ఏ పార్టీవైపు ఉంటారనేదాన్నిబట్టే, ఆయా పార్టీల గెలుపు లెక్కలు ఆధారపడి ఉంటాయని రాజకీయనిపుణులు అంచనా వేస్తున్నారు.

# రక్షణ భూములు ఇవ్వండి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని కొన్ని రక్షణ భూములను కీలకమైన ప్రజా ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి విడిచిపెట్టడానికి కోరుతూ వినతిపత్రం అందజేశారు. రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మరియు సికింద్రాబాద్ లో నివసిస్తున్న ప్రజలకు కీలకమైన మౌలిక సదుపాయాల అవసరాలను తీర్చడంలో, పౌర సౌకర్యాలను మెరుగుపరచడంలో రక్షణ శాఖ భూములు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కంటోన్మెంట్ నుంచి తెలంగాణ ప్రభుత్వానికి యూజర్ ఛార్జీల భాగం కింద దాదాపు రూ.1,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఈ బకాయిలను సకాలంలో క్లియరెన్స్ చేయడం వలన రక్షణ శాఖ పరిధిలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో ప్రజా మౌలిక సదుపాయాలు కల్పించడం వారికి అవసరమైన పౌర సేవలు కొనసాగించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు లభిస్తుందని అన్నారు. ప్రజా వినియోగం కోసం కొన్ని రక్షణ భూములను ఇవ్వడానికి అంగీకరించినందుకు కేంద్ర ప్రభుత్వానికి తాము కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు. అయితే ఈ భూములను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని అభ్యర్థించారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి మరియు ప్రజా సౌకర్యానికి అధిక ప్రాముఖ్యత కలిగిన కొనసాగుతున్న మౌలిక



సదుపాయాలు, మొబిలిటీ ప్రాజెక్టులను అమలు చేయడానికి ఈ భూమార్పిడి కీలకం అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరగడం లేదని ప్రస్తావించారు. ప్రజాస్వామ్య పాలన, స్థానిక ప్రాతినిధ్యం దృష్ట్యా, ఈ ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. హైదరాబాద్ అభివృద్ధికి కీలకమైన ఈ అంశాలపై రక్షణ మంత్రిత్వ శాఖ తగిన పరిశీలన చేస్తుందని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు.

# ఫుల్ కిక్కే కిక్కు

మొదటి పేజీ తరువాయి

రూ. 419 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 30వ తేదీన రూ. 333 కోట్లు మద్యం అమ్మకాలు జరిగాయి. అక్టోబర్ ఒకటో తేదీన 86 కోట్ల మద్యం సేల్స్ జరిగినట్లు అధికారులు వెల్లడించారు. సాధారణ రోజులతో పోలిస్తే సెప్టెంబర్ 26 నుంచి మద్యం అమ్మకాలు రెట్టింపయ్యాయని వివరించారు. దసరా, అక్టోబర్ 2(గాంధీ జయంతి) ఒకేరోజు రావడంతో.. అంతకు ముందు రోజు భారీగా మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు స్పష్టం చేశారు. దసరా, అక్టోబర్ 2(గాంధీ జయంతి) ఒకేరోజు రావడంతో.. అంతకు ముందు రోజు భారీగా మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు స్పష్టం చేశారు. అయితే అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మద్యం అమ్మకాలతోపాటు మాంసం దుకాణాలు కూడా బంద్ అయ్యాయి. దీని ఎఫెక్ట్ దసరా పండుగపై పడింది. అక్టోబర్ 2న గాంధీ జయంతితోపాటు దసరా పండుగ కూడా వచ్చింది. ఆ రోజు మద్యం షాపులు బంద్ నేపథ్యంలో ఒకరోజు ముందుగానే అంటే అక్టోబర్ 1వ తేదీనే వైన్ షాపుల వద్ద రద్దీ పెరిగింది. వైన్ షాపులు, లిక్కర్ మార్ట్ ముందు మందుబాబులు క్యూ కట్టిన పరిస్థితి. ఈ క్రమంలో దసరా, అక్టోబర్ 2 ఒకే రోజు వచ్చినప్పటికీ అంతకు ముందు రోజు భారీగా మద్యం విక్రయాలు జరిగాయని ఎక్సైజ్ శాఖ వెల్లడించింది. ప్రతీ ఏటా దసరా వేళ ఎక్సైజ్ శాఖ కు లిక్కర్ అమ్మకాలతో భారీగా ఆదాయం సమ కూరుతోంది. ఈ సారి అంతకు మించి రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. అటు మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానించటంతో... ఎక్సైజ్ శాఖ ప్రస్తుతం కొత్త దుకాణాల ఖరారు పైన ప్రత్యేకంగా ఫోకస్ చేసింది.

# పాక్‌ను మ్యాప్‌లో లేకుండా చేస్తాం

**విశాలభారతి, జాతీయం:**

ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ఆపకపోతే, పాకిస్తాన్ అనేది మ్యాప్ నుండి తుడిచిపెట్టుకుపోవచ్చు అని వార్నింగ్ ఇచ్చారు. ఈసారి భారత సైన్యం గతంలోలా ఓపిక పట్టదని ఆయన అన్నారు.

**త్వరలో ఆపరేషన్ 2.0..**

పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేయడం ఆపకపోతే, ‘ఆపరేషన్ సింధూర్’ 2.0 త్వరలో ప్రారంభించవచ్చు. ‘బ్రతికి ఉన్నంత కాలం ఆపరేషన్ సింధూర్ గుర్తుండిపోతుంది’ అన్నారు. ఆపరేషన్ సింధూర్ 1.0 సమయంలో భారత సైన్యం పాకిస్తాన్ కు చెందిన 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిందని, ఈ ఆపరేషన్‌లో 100 మందికి పైగా పాకిస్తాన్ సైనికులు, ఉగ్రవాదులు హతమయ్యారని చెప్పారు. ఈ ఆపరేషన్ ఆధారాలను ప్రపంచానికి కూడా చూపించాం అన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయం సైనికులు, స్థానికులకు దక్కుతుందన్నారు.

**ఈసారి భారత్ అంత ఓపికగా ఉండదు..**

ఆపరేషన్ సింధూర్ మన జీవితాలతో ముడిపడి ఉందని,



మనం ఉన్నంత కాలం ఇది గుర్తుకు ఉంటుందని అన్నారు. ఆపరేషన్ సింధూర్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరు పెట్టారని, ఇది మహిళలకు అంకితం చేయబడిందని అన్నారు. ఈసారి భారతదేశం పూర్తి సన్నద్ధతతో ఉందనని, పరేషన్ సింధూర్ 2.0లో భారతదేశం ఆపరేషన్ సింధూర్ 1.0లో చూపించిన ఓపికను ప్రదర్శించదు. ఈసారి భారతదేశం అలాంటి చర్యలు తీసుకుంటుందండే.. పాకిస్తాన్ అనేది చరిత్రలో మ్యాప్2లో ఉంటుందా లేదా అని ఆలోచించాల్సి వస్తుంది. పాకిస్తాన్ భూమిపై తన స్థానాన్ని నిలుపుకోవాలనుకుంటే, ఉగ్రవాదాన్ని అంతం చేయాలన్న ఉపేంద్ర ద్వివేది.. ఆపరేషన్ సింధూర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు సర్వీస్ అధికారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ 140వ బెటాలియన్ కమాండెంట్ ప్రభాకర్ సింగ్, రాజ్‌పుతానా రైఫిల్స్ మేజర్ రితేష్ కుమార్, హవల్దార్ మోహిత్ గైరాను ఆర్మీ చీఫ్ సత్కరించారు.

**ఆపరేషన్ సిందూర్ లో 5 పాక్ ఫైటర్ జెట్‌లు కూల్చివేశాం..**

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ కు జరిగిన నష్టాలపై భారత వైమానిక దళ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ AP సింగ్ స్పందించారు. భారత్ కొట్టిన దెబ్బకు పాకిస్తాన్ తీవ్రంగా నష్టపోయింది. ఐఏఎఫ్, భారత ఆర్మీ కలిసి పాకిస్తాన్ లోని ఎయిర్ ఫోర్స్ బేస్ క్యాంపులపై భారీ దాడి చేసి, వారికి తీవ్ర నష్టం కలిగించాం. భారత్ చేసిన దాడుల కారణంగా కనీసం నాలుగు చోట్ల రాడార్లు, రెండు చోట్ల కమాండ్, కంట్రోల్ కేంద్రాలు, రెండు చోట్ల రన్‌వేలు దెబ్బతిన్నాయి. మరో మూడు వేర్వేరు ఎయిర్ బేస్ స్టేషన్లలో మూడు హ్యాంగర్లు దెబ్బతిన్నాయి.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం
4.10.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily






## నివాళులర్పించిన ఆకుల ఇంద్రసేనారెడ్డి

చౌటుప్పల్, విశాలభారతి:

పట్టణ కేంద్రంలోని లక్కారం గ్రామానికి చెందిన గుండెబోయిన ఐలయ్య యాదవ్ రాత్రి అకస్మాత్ గా మృతి చెందారు. ఈ సందర్భంగా చౌటుప్పల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అండ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి ఆయన మృతదేహానికి పూలమాల వేసి,నివాళులర్పించి తదనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ సైదులు గౌడ్,నాయకులు గుండెబోయిన ఐలయ్య యాదవ్,గోపన బోయిన జంగయ్య యాదవ్,ఎరుకల యాదయ్య గౌడ్, లాలయ్యగౌడ్,ఉడుత నరసింహ యాదవ్,వర్ధం నరసింహ యాదవ్,నారగోని అంజయ్య తదితరులు పాల్గొన్నారు,

## అలాయ్ బలైలో పాల్గొన్న రవి ప్రసాద్ గౌడ్

సికింద్రాబాద్ విశాలభారతి :

హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అలై బలై కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు. పలు కార్యక్రమాలను పర్యవేక్షించి అనంతరం వారి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది.



# అనుమతి లేకుండా కన్వెన్షన్!





### నార్సింగ్ మున్సిపాలిటీ జనవాడ దగ్గర అడ్డగోలుగా నిర్మాణం

### గండిపేట బఫర్ జోన్ ఆక్రమించినట్లు ఆరోపణలు

### కొన్ని నెలలుగా నిర్మాణపు పనులు

### పట్టించుకోని మున్సిపల్ అధికారులు

### సత్వర చర్యలకు స్థానికుల డిమాండ్

### కూల్చివేయాలంటున్న ప్రజలు

రాజేంద్రనగర్, విశాలభారతి :

ఎలాంటి అనుమతులు లేకుండానే భారీ కన్వెన్షన్ నిర్మించడం పలు అనుమానాలకు తావిస్తోంది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నార్సింగి మున్సిపల్ పరిధిలోని జన్వాడ సమీపంలో కొన్ని నెలలుగా అడ్డగోలుగా భారీ స్థాయిలో కన్వెన్షన్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. 111 జీవో పరిధిలో జరుగుతున్న ఈ వ్యవహారంపై మున్సిపల్ అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరించడం పలు అనుమానాలకు భావిస్తుంది. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ 111 జీవో పరిధిలో నిర్మాణాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ఒక్కో నిర్మాణం వద్ద 10 నుంచి 20 లక్షల రూపాయల మామూళ్లు తీసుకుంటూ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని నార్సింగి మున్సిపల్ ప్రజలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జన్వాడ గ్రామ పరిధిలో చేపడుతున్న ఈ నిర్మాణం కోసం నిర్వాహకులు మున్సిపల్ అధికారుల నుంచి ఎలాంటి పర్మిషన్ తీసుకోకుండానే చక చక పనులు చేయడం గమనార్హం.

**111 జీవోకు మంగళం...**

కొందరు అక్రమార్కులు 111 జీవో నిబంధనలకు తూట్లు పొడుస్తూ తమ ఇష్టారాజ్యంగా కన్వెన్షన్లు, షెడ్లు నిర్మించుకుంటున్నారు. లక్షల రూపాయలు మున్సిపల్ అధికారులకు ముట్టచెబితే తమను అడిగేది ఎవరూ లేరనే ధీమాలో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. జంట జలాశయాలైన గండిపేట, హిమాయత్ సాగర్ చెరువులను పరిరక్షించేందుకు గతంలో టిడిపి ప్రభుత్వం 111 జీవోను తీసుకొచ్చింది. ఈ నిబంధనల ప్రకారం ఈ జీవో పరిధిలో ఉన్న ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా చేపడితే మున్సిపల్ అధికారులు తక్షణమే కూల్చి వేయాల్సి ఉంటుంది. కానీ నార్సింగ్ మున్సిపల్ పరిధిలో అలా జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు అడిగిన కాడికి డబ్బులు మూటలు ముట్ట చెబుతూ అక్రమార్కులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. జనవాడ గ్రామ పరిధిలో నిర్మిస్తున్న కన్వెన్షన్ హాల్ నిర్వాహకులు పక్కనే ఉన్న గండిపేట చెరువు బఫర్ జోన్ ను కూడా ఆక్రమించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు మొద్దు నిద్ర వీడి నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న కన్వెన్షన్ హాలును వెంటనే కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## విజయదశమి శుభాకాంక్షలు

### తెలిపిన దాసరమోని ప్రవీణ్ ముదిరాజ్

పెద్ద అంబర్ పేట్ , విశాలభారతి:

విజయదశమి పండుగ సందర్భంగా ఈ రోజు ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు దాసరమోని ప్రవీణ్ ముదిరాజ్ , పెద్ద ఎత్తున తన అనుచరులతో కలిసి రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ని, పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ని వారి ఎలిమినేడు నివాసంలో కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.





## అనారోగ్యంతో బాధపడుతున్న బిఆర్ఎస్ కార్యకర్త

### నివాసానికి వెళ్లి పరామర్శించినా ఎమ్మెల్యే

కాప్రా, విశాలభారతి:

ఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డ కి చెందిన బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్త ప్రమోద్ తండ్రి రమేశ్ అనారోగ్యంతో బాధపడుతున్న స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి ,దసరా వేడుకలు





### వాసవి క్లబ్ అధ్యక్షులు చిదిరాల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో

తొర్రూరు, విశాలభారతి:

తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని బాలికల పాఠశాలలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా గాంధీ జయంతి వేడుకలను చిధిరాల. నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు ప్రొద్దుటూరు గౌరీశంకర్, బిజ్జల. అనిల్,కుమార్,తాటికొండ. సదాశివ,ఇమ్మడి రాంబాబు సి. హెచ్ రాము. గోపారపు నిరంజన్ పాల్గొన్నారు. నవీన్ కుమార్ మాట్లాడుతూ... భారత దేశ స్వాతంత్రం కోసం తెల్లదొరల నుంచి అహింసా మార్గంలో సత్య మేవ జయతే తెల్ల దొరల నుండి భారత దేశాని కి స్వాతంత్ర్యం కోసం పోరాడి భారత జాతిని ఏకతాటిపై నిలిపి స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టిన జాతిపిత మహాత్మా గాంధీ అని అన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం విజయదశమి సందర్భంగా దసరా వేడుకలను నిర్వహించినారు. దసరా వేడుకలలోజమ్మి చెట్టుకు పూజ చేసి జమ్మి పత్రి నీ అందరికి ఇచ్చినారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు ప్రొద్దుటూరు గౌరీశంకర్,బిజ్జల అనిల్, కుమార్, తాటికొండ సదాశివ, ఇమ్మడి రాంబాబు, రాము,గోపారపు నిరంజన్ వాసవి క్లబ్ సభ్యులు,తమ్మీ రమేష్,ఇమ్మడి.రాంబాబు,వజినపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే దసరా ఉత్సవాలను జరుపుకున్నారు. దసరా ఉత్సవ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ... చెడుపై మంచి సాధించిన పర్వదినం విజయదశమి అని అన్నారు. విజయదశమి సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో అష్టశ్వర్యాలతో జీవించాలని జమ్మి చెట్టుకు పూజ చేసి కోరుకున్నట్లు తెలిపారు.



### విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన క్యామ మల్లేష్

పెద్ద అంబర్ పేట్ , విశాలభారతి:

విజయదశమి పండుగ సందర్భంగా ఈ రోజు భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ , మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు

### తెలిపిన మాజీ మున్సిపాలిటీ కౌన్సిలర్లు

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

రంగా రెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి జన్మదిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాల్వలతో సత్కరించి పుట్టినరోజు, విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ చైర్మన్ పండుగల జయశ్రీ రాజు,మాజీ కౌన్సిలర్లు,వడ్డేపల్లి విద్యా విజేందర్ రెడ్డి, పసుల రాజేందర్, పోరెడ్డి మధుసూదన్ రెడ్డి, మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



### ఘనంగా లక్ష పుష్పార్చన

కాప్రా, విశాలభారతి:

అమ్మవారికి ఘనంగా లక్ష పుష్పార్చన నిర్వహించడం మా అదృష్టం అని కుషాయిగూడ, నాగార్జున నగర్, లక్ష్మీ నగర్ కాలనీ తుల్జా శ్రీ యూత్ అసోసియేషన్ మెంబర్ అఖిల్ అన్నారు.

## దసరా శుభాకాంక్షలు తెలిపిన పట్లోల సబితా ఇంద్రారెడ్డి



రాజేంద్రనగర్, విశాలభారతి:

మాజీమంత్రి , మహేశ్వరం నియోజకవర్గం శాసన సభ్యురాలు పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డిని మరియు రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మైలర్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ మరియు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుభాష్ రెడ్డి రమేష్ ముదిరాజ్ , లక్ష్మీ రాజ్ , రాము యాదవ్ , రాజేష్ యాదవ్ గుమ్మడి కుమార్ , ఈర్లపల్లి ప్రవీణ్ , జి.రాజు , చికెన్ రాజు , శ్రీకాంత్ రెడ్డి , రాజ్ కుమార్ , ప్రదీప్ , అశోక్ కుమార్ , లయన్ కార్తీక్ , సునీల్ , వెంకటరమణ , పోతురాజు రమేష్ శివారెడ్డి బాలాజీ , నరేష్ , అనిల్ , శ్రీకాంత్ , నాని , రమేష్ , చింటూ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ భూగర్భ గనుల శాఖ మరియు హోంశాఖ మరియు విద్యాశాఖ మార్చులు పి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ విజయదశమి పర్వదినం చెడుపై మేలు సాధించిన రోజు. ఈ పవిత్ర దినం ప్రజలందరికీ స్ఫూర్తినిస్తూ, ప్రతి ఇంటా ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని మనసారా కోరుకుంటున్నాము. తెలంగాణ ప్రజలందరికీ మంచి జరగాలని, సుఖశాంతులు కలగాలని ఆశిస్తున్నాము" అని సూచించారు.

### అనాజ్‌పూర్‌లో గొడవ

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని అనాజ్‌పూర్ గ్రామంలో వ్యక్తిగత గొడవ చోటుచేసుకుంది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఫిర్యాదుదారు జమ్ముల వీరేష్ (31), వృత్తి డ్రైవర్ గా పని చేస్తున్నట్టు తెలిపిన వివరాల ప్రకారం – అదే గ్రామానికి చెందిన నక్క వీనిల్ స/o కోమురయ్య తరచూ మద్యం తాగి రోడ్డుపై అల్లరి చేయడం జరుగుతుండేది. దీనిపై పలుమార్లు హెచ్చరించడంతో వీరేష్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో అక్టోబర్ 2న నక్క వీనిల్ తన స్నేహితుడు ప్రథాప్‌తో కలిసి వీరేష్ ఇంటికి వెళ్లి గొడవపడి, బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, నిందితులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుండి కత్తిని స్వాధీనం చేసుకున్నామని అబ్దుల్లాపూర్ మెట్ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజేంద్రనగర్, విశాలభారతి:

రాత్రి అందాజ 09:40 గంటల సమయంలో గగనపహాడ్ – షంషాబాద్ రోడ్, NH-44 రోడ్, రామ్‌కీ సమీపంలో ఒక రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి (వయసు సుమారు 55–60 ఏళ్లు, ముదురు రంగు, తెల్లటి ఫుల్ హండ్స్ షర్ట్, ఆకుపచ్చ ప్యాంట్ ధరించినవాడు) రోడ్డు దాటుతుండగా TS07EY2803 నంబర్ బైక్ వేగంగా, నిర్లక్ష్యంగా ఢీకొట్టగా మృతుడికి తలకు తీవ్ర గాయాలు, రెండు కాళ్లకు ఫ్రాక్చర్లు ఏర్పడి తీవ్రత రక్తస్రావం జరగడంతో అక్కడికక్కడే మృతి చెందగా స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురి కి తరలించినారు. ఇట్టి మృతుడిని సంబంధిత ఎవరైనా గుర్తిస్తే రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ పోలీసు స్టేషన్ లో సంప్రదించండి. Cell no. 8712663311.



vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం
4.10.2025
హైదరాబాద్

epaper:vishalabharati.com
www.vishalabharati.com




## జుబీన్ గార్గ్ మేనేజర్ సహా ఇద్దరి అరెస్ట్

**గౌహతి:** సింగపూర్‌లో సెప్టెంబర్ 19వ తేదీన అనుమానాస్పద స్థితిలో చనిపోయిన గాయకుడు జుబీన్ గార్గ్ ఉదంతంపై దర్యాప్తు కీలక మలుపు తిరిగింది. ఘటనపై అసోం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ బృందం జుబీన్ మేనేజర్ సిద్ధార్థ శర్మ, నార్త్ ఈస్ట్ ఫెస్టివల్ నిర్వాహకుడు శ్యాంకను మహంతాను బుధవారం ఉదయం ఢిల్లీలో అరెస్ట్ చేసింది. వీరిద్దరిపై నేరపూరిత కుట్ర, నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించి జుబీన్ మరణానికి కారణమయ్యారన్న ఆరోప ణలపై కేసులు నమోదు చేసింది. వీరిని వెంటనే గౌహతికి తరలించి కామ్‌రూప్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరుపర్చగా 14 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. దసరా సెలవులు కావడంతో జడ్జి ఇంటి వద్దే వీరిని హాజరు పర్చామని సిట్ చీఫ్ సీఐడీ స్పెషల్ డీజీపీ మున్నా ప్రసాద్ గుప్తా చెప్పారు. శర్మ, మహంతాలపై ఇప్పటికే ఇంటర్‌పోల్ ద్వారా లుకౌట్ నోటీసు జారీ అయ్యిందని, ఈ నెల 6వ తేదీలోగా వీరిని తమ ఎదుట హాజరు కావాలని కోరామని ఆయన తెలిపారు.



## శ్రామిక మహిళల సదస్సులు విజయవంతం చేయాలి

### ఈనెల 5 న శ్రామిక మహిళ రాష్ట్ర సదస్సులు

**కీసర,విశాలభారతి :**

మేడ్చల్ జిల్లా మహిళా కన్వీనర్ ఎం.రేవతి కళ్యాణి శుక్రవారం శ్రామిక మహిళ రాష్ట్ర సదస్సు గోడపత్రికను కీసరలో ఆవిష్కరించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ శ్రామిక మహిళ రాష్ట్ర సదస్సులు ఈ నెల అక్టోబర్ 5, 6న కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,కాగజ్ నగర్,వినయ్ గార్డెన్స్ లో జరగనున్నాయి అని తెలిపారు.మహిళా శ్రామికుల ఆర్థిక,సామాజిక, రాజకీయ,ఉద్యోగ భద్రత సమస్యలపై చర్చ మొదటి రోజు ఎస్పిఎం క్రికెట్ గ్రౌండ్ బ్యాంక్,రాజీవ్ గాంధీ చౌరస్తా లో భారీ ప్రదర్శన ఉంటుంది అనీ అన్నారు.సిఐటీయూ జాతీయ నాయకులు ప్రతినిధులు భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారు అని తెలిపారు.రాష్ట్ర నలుమూలల నుండి వందల మంది మహిళలు రానున్నారు కావున మేడ్చల్ జిల్లా నుండి పెద్ద ఎత్తున ప్రతినిధులు హాజరు కావాలి అని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఆశ వర్కర్లు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.




## వెంకటేశ్వర స్వామి ఆలయ గడప పూజ

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

రంగా రెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మునగనూర్ గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్మాణం జరుగుతున్న శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి అభిషేక ఆనంద ఆలయంలో ప్రధాన ద్వారం, గర్భాలయం గడప పూజ - హోమం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గౌరవ టీపీసీసీ అధ్యక్షులు, శాసన మండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి , గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి కలిసి విజయదశమి శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్సీ ఏవీఎన్ రెడ్డి, టి ఎస్ ఆర్ డి సి చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు మల్ రెడ్డి యాదిరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర చారి, సభ్యులు పి. జైపాల్ రెడ్డి, డి. అంజయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అల్లరి చేస్తోందని.. చేతులు విరిచి..
## ట్యాంకులో పడేసి.. ఏడేళ్ల బాలిక హత్య

మాదన్న పేట బాలిక హత్యకేసును పోలీసులు ఛేదించారు. ఏడేళ్ల బాలిక అల్లరి చేస్తుందనే కారణంతో మేనమామ,అత్త కిరాతకంగా ప్రాణాలు తీసినట్లు పోలీసులు గుర్తించారు. ఇంట్లో అల్లరి చేస్తుందన్న కారణంతో బాలికను నోటికి ప్లాస్టర్ వేసి, కాళ్లు చేతులు కట్టేసి వాటర్ ట్యాంక్‌లో పడేశారు. అయితే, బాలిక తల్లితో నిందితులకు గత కొంతకాలంగా ఆస్తి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఓ వైపు ఆస్తి పంపకాల విషయంలో గొడవలు, పాప అల్లరి చేయడం తట్టుకోలేక విచక్షణ కోల్పోయిన నిందితులు ఈ దారుణానికి ఒడిగట్టారు. పోలీసుల వివరాల మేరకు.. ఒవైసీ కంచన్ బాగ్ ప్రాంతానికి చెందిన ఏడేళ్ల బాలిక గత వారం తన తల్లితో కలిసి మాదన్నపేటలో నివసించే అమ్మమ్మ ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో మొన్న సాయంత్రం ఇంట్లో నుండి బయటకి వెళ్లిన బాలిక ఆచూకీ గల్లంతయ్యింది. చీకటి పడుతున్న పాప ఆచూకీ లభ్యం కాకపోవడంతో బాలిక తల్లి, అమ్మమ్మ, ఇతర కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే.. బాలిక మృతదేహం నీళ్ల ట్యాంక్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.ప్రమాదవ శాత్తూ బాలిక నీళ్ల ట్యాంకులో పడిపోయిందా.. లేదంటే ఎవరైనా హత్య చేసి అందులో పడేశారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇంటి వాటర్ ట్యాంక్‌లో నిర్జీవంగా ఉన్న బాలిక మెడ, నోరు, చేతులు అనుమానాస్పద గుర్తులు ఉండటం, చేతులు వెనక్కి విరిచి ఉండడంపై పోలీసులు బాలికది హత్యేనని ప్రాథమిక దర్యాప్తులో విచారణలో నిర్ధారించారు. కుటుంబ సభ్యుల్ని సైతం అదుపులోకి తీసుకున్నారు. ఈ విచారణలో బాలిక మేనమామ,అతని భార్య తీరు అనుమానాస్పదంగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. పోలీసులు తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టగా దారుణం వెలుగులోకి వచ్చింది. బాలికను హత్య చేసింది మేనమామ,అత్తేనని గుర్తించారు.

## 'నా కొడుకుని వదలనంది..' పూజపై అభిషేక్ తండ్రి సంచలన ఆరోపణలు

యూపీ యువ వ్యాపారి అభిషేక్ గుప్తా హత్య కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో హిందూ మహాసభ నేత పూజా శకున్ పాండే భర్త అశోక్ పాండేను, మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న పూజ కోసం పోలీసులు గాలిస్తున్నాడు. ఇదిలా ఉండగా.. అభిషేక్ తండ్రి సంచలన ఆరోపణలకు దిగాడు. వివాహేతర సంబంధమే ఈ ఘాతుకానికి కారణమని చెబుతున్నాయాన. అలీఘడ్‌లో ఓ బైక్ షోరూమ్ ఓనర్ అయిన అభిషేక్ గుప్తా(30) సెప్టెంబర్ 23వ తేదీన దారుణ హత్యకు గురయ్యారు. తండ్రి, కజిన్‌తో కలిసి బస్సు కోసం ఎదురు చూస్తున్న సమయంలో.. బైకుపై వచ్చిన ఇద్దరు దుండగులు తుపాకీతో కాల్చి పారిపోయారు. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మరణించాడు. అబిషేక్ తండ్రి ఫిర్యాదు మేరకు.. పోలీసులు పూజా శకున్ పాండే(%ూశీశీయఖ రాష్ట్రుఎబఅ్రుఖఅనవవ%) భర్తను అశోక్‌ను, కాల్చి చంపిన మహమ్మద్ ఫజల్‌ను అరెస్ట్ చేశారు. అయితే.. పూజతో తన కొడుక్కి వివాహేతర సంబంధం ఉందని, దాని నుంచి బయటపడే క్రమంలోనే దారుణ హత్యకు గురయ్యాడని అభిషేక్ తండ్రి ఆరోపిస్తున్నారు. సుపారీ హంతకుడికి డబ్బులు చెల్లించి ఆ జంట ఈ హత్య చేయించిందని చెబుతున్నారు. దీంతో ఇప్పటిదాకా కేవలం ఆర్థిక లావాదేవీల కారణంగానే ఈ హత్య జరిగిందని భావిస్తూ వచ్చిన అలీఘడ్ పోలీసులు.. ఆ కోణంలోనూ దర్యాప్తునకు సిద్ధమయ్యారు.

**అభిషేక్ తండ్రి ఏమన్నారంటే..**

పూజా శకున్ పాండేకి, తన కొడుకుకి మధ్య వివాహేతర సంబంధం ఉందని నీరజ్ గుప్తా మీడియాతో చెప్పారు. "నా చిన్న కొడుకు వివాహ సమయంలో ఆమె(పూజా శకున్) నానారచ్చ చేసింది. తనను పెళ్లి చేసుకోవాలంటూ అభిషేక్‌పై ఒత్తిడి తెచ్చింది. ఇదే విషయాన్ని అతను నా భార్య(అభిషేక్ తల్లి)కి చెప్పాడు. ఆమె నాకు ఈ విషయం చెప్పింది. ఒత్తిళ్లకు తలొగ్గి ఎక్కడ పూజను వివాహం చేసుకుంటాడో మేం అని ఆందోళన చెందాం. చివరకు ఆమె నెంబర్ బ్లాక్ చేసి దూరం పెట్టడం ప్రారంభించాడు. ఆ సమయంలోనూ ఆమె మాతో గొడవ పెట్టుకుంది. అతన్ని ఎట్టి పరిస్థితుల్లో వదిలే ప్రసక్తే లేదంది. అంతేకాదు.. అభిషేక్ వ్యాపారం మొదలుపెట్టిన సమయంలోనూ తనను భాగస్వామిగా చేర్చుకోవాలంటూ మమ్మల్ని బెదిరించింది అని సంచలన ఆరోపణలు చేశాడాయన.

# ఘనంగా దసరా ఉత్సవాలు

**తొర్రూర్, విశాలభారతి:**

దసరా ఐకమత్యం, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరు పట్టణంలోని యతీరాజారావు పార్క్‌లో దసరా పండుగ సందర్భంగా ఘనంగా రావణ వధా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రావణుడి ప్రతిమకు నిప్పుపెట్టి సంప్రదాయబద్ధంగా రావణ దహనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. రంగురంగుల దీపాలు,బాణాసంచా, సాంస్కృతిక కార్యక్రమాలతో వేదిక వన్నెతెచ్చింది. చిన్నపిల్లలు నుండి పెద్దవారివరకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై ఈ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. రావణుడి దహనంతో ఆకాశాన్ని నింపిన పటాకుల శబ్దం, వెలుగులు పట్టణ ప్రజలకు ఉత్సాహాన్ని కలిగించాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. దసరా పండుగ చెడుపై మేలుకి ప్రతీక. ఇది సత్యం, ధర్మం, న్యాయం ఎల్లప్పుడూ గెలుస్తాయనే స్ఫూర్తిని అందిస్తుంది. రావణ వధా వంటి కార్యక్రమాలు సమాజంలో చెడును నిర్మూలించేందుకు, మంచి విలువలను ఆచరించేందుకు మనందరికీ దిశా నిర్దేశం చేస్తాయి. ఈ పండుగ ఐకమత్యం,సౌభ్రాతృత్వానికి



సంకేతం అని అన్నారు..మా అత్తమ్మ టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి తరుపున కూడా మీ అందరికి దసరా శుభాకాంక్షలు తెలుపుతున్నాను అని పేర్కొన్నారు.అదే విధంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ఎమ్మెల్యే గారు అభినందిస్తూ ప్రతి ఏటా మరింత ఉత్సాహంగా, మరింత ఘనంగా దసరా పండుగను నిర్వహించి కొత్త తరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయాలి అని ఆకాంక్షించారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.

# ఇప్పటికీ వీడని సందేహాలు

బిహార్‌లో వివాదరహితంగా, పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించాలన్న సదుద్దేశం ఎన్నికల సంఘానికి(ఈసీ)కి ఉందా మంగళవారం విడుదల చేసిన బిహార్ ఓటర్ల తుది జాబితా గమనిస్తే ఈ విషయంలో ఎవరికైనా సంశయం కలుగుతుంది. రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 7.42 కోట్లని ఆ జాబితా ప్రకటిస్తోంది. వివాదాస్పదమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట జూన్ 24న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభించే నాటికి బిహార్ ఓటర్ల సంఖ్య 7.89 కోట్లు. అంతకు ఆర్నెల్ల ముందు ప్రకటించిన ఆ జాబితాను కాదని మళ్లీ ఆదరా బాదరాగా ఈ సవరణ దేనికని విపక్షాలు ప్రశ్నించాయి. 2003 జనవరి 1ని ప్రాతిపదికగా తీసుకుని, అటుపై జాబితాలోకి ఎక్కిన వారిని సంశయ ఓటర్లుగా పరిగణించి వారి నుంచి వివిధ రకాల పత్రాలు కోరటం కొత్తగా అమల్లోకి తెచ్చిన ప్రక్రియ సారాంశం. దాని ప్రకారం 1987 జూలై 1 లేదా అంతకు ముందు జన్మించినవారు జనన ధ్రువీకరణ పత్రం లేదా పుట్టిన ఊరు ధ్రువీకరణ పత్రం... లేదా రెండూ సమర్పించాలి. జూలై 1, 1987- డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు ఈ పత్రాలతో పాటు తల్లితండ్రుల్లో ఎవరో ఒకరి జనన లేదా ప్రాంత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ఆ తర్వాత జన్మించిన వారు తమ ధ్రువీకరణ పత్రాలతో పాటు తల్లితండ్రులిద్దరివీ కూడా సమర్పించాలి. లేనట్టయితే జాబితాలో చోటుండబోదని ఈసీ ప్రకటించింది. సుప్రీంకోర్టు జోక్యంతో చివరకు ఆధార్‌ను చేర్చారు. ఆగస్టు 1న ప్రకటించిన తొలి ముసాయిదా జాబితా ఓటర్ల సంఖ్యను 7.24 కోట్లుగా ప్రకటించినప్పుడు విపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఆధార్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్న ధర్మాసనం సూచన అమలు చేసి తాజాగా ప్రకటించిన ముసాయిదాలో కూడా సంశయాలు తప్పలేదు. 2020 జూలైలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ - జనాభా జాతీయ కమిషన్ సంయుక్తంగా విడుదల చేసిన జనాభా అంచనా నివేదిక ప్రకారం బిహార్‌లో 18 ఏళ్లు, అంతకుపైబడి వయసున్న జనాభా 8.18 కోట్లు. తాజా ఓటర్ల జాబితా గమనిస్తే ఇందులో 76 లక్షలమంది ఓటర్లుగా నమోదు చేసుకోలేదనుకోవాలి.అయిదేళ్లనాటి కేంద్ర నివేదిక కేవలం అంచ నాయే అనుకున్నా తాజాగా ప్రకటించిన ఓటర్ల జాబితాలోని సంఖ్య దానికి దరిదాపు ల్లోనైనా ఉండొద్దా ఈసీ తీరుపై సంశయాలు వ్యక్తం కావటానికి మరో కారణముంది. సెప్టెంబర్ 1న గడువు ముగిసే సమయానికి ఓటర్ల జాబితాలో చేర్చమంటూ తమకు 16.93 లక్షల దరఖాస్తులు అందాయని సంస్థ స్వయంగా ప్రకటించింది. ఇకపై దరఖాస్తులు స్వీకరించేది లేదని కూడా చెప్పింది. మరి 21.53 లక్షలమంది కొత్త ఓటర్లు చేరారని ఇప్పుడెలా ప్రకటించారు సెప్టెంబర్ 1 తర్వాత కూడా దరఖాస్తులు తీసుకున్నారనుకోవాలా రెండింటి మధ్యా వ్యత్యాసం ఏకంగా 4.60 లక్షలుంది. మరి సంశయాలు రావా దీనిపై వివరణనివ్వొద్దా ఆ సంగతలా ఉంచి తొలగించిన 47 లక్షలమందిలో ఏయే కారణాలతో ఎంతమందిని తొలగించారన్న డేటా లేదు. ఈసీ అనుమానించినట్టు వాస్తవంగా 'విదేశీయులు'గా ముద్రపడిన వారెందరు 'అనర్హులైన ఓటర్లు'గా పరిగణించి 3.66 లక్షలమందిని తొలగించామన్నారు. వీరంతా 'విదేశీయులు' అనుకోవాలా ఏ పత్రమూ దాఖలు చేయలేని వారి మాటేమిటి ఇక మృతులు, శాశ్వతంగా వలసపోయినవారు,రెండుచోట్ల నమోదైనవారు ఎందరన్న వర్గీకరణ కూడా లేదు. జిల్లాలవారీ డేటా సైతం ఇవ్వలేదు. పట్నా జిల్లాలో ఓటర్ల సంఖ్య 1.63 లక్షలు పెరిగిందని అక్కడి జిల్లా పాలనాయంత్రాంగం చెప్పింది. ఇతర జిల్లాల్లో తగ్గిందని చెప్పటం తప్ప వాటి వివరాలు లేవు.ఇది ఇక్కడితో ఆగిపోదు. తొలగించిన పేర్లు, కొత్తగా చేర్చిన పేర్లు విపక్షాలు జల్లెడపట్టి ఈసీ ప్రకటించిన తుది జాబితా దుమ్ము దులుపుతాయి. దేశమంతటా 'సర్' అమలు చేస్తామని సంబరంగా ప్రకటించటం కాదు... బిహార్‌లో తలెత్తుతున్న సందే హాలకు ఈసీ సమాధానం చెప్పాలి. పారదర్శకంగా ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాల్లో ఈవీఎంలపై వచ్చిన సంశయాలను ఇంతవరకూ ఈసీ నివృత్తి చేయలేదు. ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను పెంచడానికి ఏం చేయబోతున్నారో చెప్పిందీ లేదు. ఈ దశలో ఈసీ చిత్తశుద్ధిని పార్టీలైనా, ప్రజానీకమైనా నమ్మగలరా

## జాతర కోసం వచ్చి..రైల్వే ట్రాక్‌పై
## రీల్స్ స్పాట్‌లోనే నలుగురూ!

ప్రమాదమని రైళ్లలో ప్రయాణిస్తూ, కొందరు, రైలు పట్టాలపై కొందరు ప్రమాదకర స్టంట్స్ చేస్తూ రీల్స్ తీసుకుంటున్నారు. అతి ప్రమాదకరమైన ఈ స్టంట్స్‌తో ప్రాణాలు పోతున్నా, అస్సలు పట్టించుకోవడం లేదు. తాజాగా వందే భారత్ రైలు వచ్చే ట్రాక్ పై రీల్స్ చేస్తూ నలుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. బీహార్‌లోని పూర్నియాలోని రైల్వే బూత్ సమీపంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. దుర్గా పూజ ఉత్సవానికి హాజరై తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.ఈ విషాద సంఘటన స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది.బీహార్‌లోని పూర్ణియాలో రైల్వే ట్రాక్‌పై ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ షూట్ చేస్తున్న నలుగురు యువకులు ప్రమాదానికి గురైన ఘటన ఇలాంటిదే. రైలు పట్టాలపై రీల్స్ షూట్ చేస్తుండగా జోగ్బాని-దానాపూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు యువకులు మృతి చెందారు. ఇద్దరు గాయ పడ్డారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు రైల్వే పోలీసులు. మృత దేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. మృతులందరూ 14 నుండి 15 సంవత్సరాల వయస్సు గలవారు. మృతుడు మాధేపురలోని మురళీగంజ్‌కు చెందినవారు.శుక్రవారం తెల్లవారు జామున 4.54 గంటలకు పూర్నియా , కస్బా రైల్వే స్టేషన్ల మధ్య జోగ్బాని-దానపూర్26301 (వందే భారత్ ఎక్స్‌ప్రెస్) రన్‌ఓవర్ గురించి మాకు సమాచారం అందింది, కొంతమంది యువకులు, ఇతరులు రైల్వే ట్రాక్‌పై రీల్స్ చేస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగిందని అనుమానిస్తున్నామని రైల్వే అధికారి తెలిపారు. దురదృష్టవశాత్తు, పనికోసం వచ్చి, జాతర చూడటానికి వచ్చిన వారు ప్రాణాలు కోల్పోయారు. చాలా విషాదం అంటూ బీజేపీ ఎమ్మెల్యే కృష్ణ కుమార్ రిషి విచారం వ్యక్తం చేశారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.మరోవైపు ఈ సంఘటనపై పూర్నియా ఎంపి పప్పు యాదవ్ స్పందించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యం. బీహార్‌లోని అనేక చోట్ల రైల్వే అండర్‌పాస్, ఓవర్‌బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది, కానీ అది జరగడం లేదని విమర్శించారు. తమ ప్రాంతానికి చెందిన బాధితులు, దళిత కుటుంబానికి చెందిన యువకులని తెలిపారు. బాధిత కుటుంబాలకు రూ. 20 లక్షల పరిహారం ఇవ్వాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాండ్ చేశారు.నోట్: ఈ ప్రమాదానికి ఖచ్చితమైన కారణం ఇంకా నిర్ధారించనప్పటికీ, ఈ సంఘటన అటువంటి విషాదాల వెనకున్న కారణాల గురించి అప్రమత్తం చేస్తుంది. ఇలాంటి ప్రమాదాలను నివారించడానికి, ప్రజలు తమ పరిసరాల గురించి అప్రమత్తంగా ఉండాలి .రీల్స్ లేదా వీడియోలను షూట్ చేసేటప్పుడు తమను తాము ప్రమాదంలో పడేయకుండా ఉండాలి. రైల్వే ట్రాక్‌లు, కొండచరియలు ,పర్వత అంచులు వంటి సున్నితమైన ప్రదేశాలకు ఎల్లప్పుడూ దూరంగా ఉండాలి.

## గలీజు పనులు చేయమంటున్నాడు.. భర్తపై భార్య ఫిర్యాదు

భర్త పెట్టిన చిత్రహింసలను మౌనంగా భరించింది. మానసికంగా, భౌతికంగా హించించినా ఓర్చుకుంది. పరాయి మహిళలతో తన పెనిమిటి పాడు సంబంధాలు పెట్టుకున్నా ఊరుకుంది. కానీ పరాయి మగాళ్ల కోరిక తీర్చాలని తనను భర్త ఒత్తిడి చేయడంతో ఆమె తట్టుకోలేకపోయింది. భర్తకు తోడు అతడి కుటుంబ సభ్యులు కూడా గలీజు పనులు చేయమని పోరు పెట్టడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ దారుణ ఘటన కర్ణాటకలోని పుట్టెనహల్లిలో (%ూబ్వఖుష్టుశ్రీశ్రీఅ%) వెలుగు చూసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసిన వివరాల ప్రకారం.. 2024, డిసెంబర్‌లో సయ్యద్ ఇనాముల్ హక్ అనే వ్యక్తితో బాధితురాలికి పెళ్లి జరిగింది. వివాహ సమయంలో 340 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక యమహా బైక్‌ను ఇచ్చారు. పెళ్లైన కొద్దిరోజులకే వరుడి అసలు రూపం బయటపడింది. అతడికి అప్పటికే పెళ్లయిందని, తాను రెండో భార్యనని తెలిసి బాధితురాలు హతశురాలయింది. అంతేకాదు తనకు 19 మంది పరాయి మహిళలతో వివాహేతర సంబంధాలున్నాయని స్వయంగా భర్త చెప్పడంతో ఆమె నిశ్చేష్టురాలయింది.అతడి ఆగడాలు అక్కడితో ఆగలేదు. బెడ్‌రూంలో సీక్రెట్ కెమెరా పెట్టి రికార్డు చేసిన వీడియోలను విదేశాల్లోని తన స్నేహితులకు పంపించాడని బాధితురాలు వెల్లడించింది. వారితో శారీరక సంబంధం పెట్టుకోవాలని బలవంతం చేశాడని, తాను ఒప్పుకోకపోవడంతో.. ప్రైవేట్ వీడియోలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించినట్టు పోలీసులకు ఆమె తెలిపింది. ఇంటా, బయట తనను పదేపదే చిత్రహింసలకు గురిచేశాడని వాపోయింది.ఫ్లాట్ కొనడానికి తన బంగారు నగలను అమ్మమని అతడు ఒత్తిడి తెచ్చాడని, తాను నిరాకరించడంతో తనపై దాడి చేశాడని ఆమె చెప్పింది. అత్తమామలతో పాటు మిగతా కుటుంబ సభ్యులు కూడా తన పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేసింది. సెప్టెంబర్ 21న బాధితురాలిపై దాడి చేసి నిందితుడు పారిపోయాడు. అతడితో పాటు కుటుంబ సభ్యులపైనా కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుడు ఇంకా పట్టుబడలేదని, అతడి కోసం గాలిస్తున్నామని చెప్పారు.